నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 29 మార్చి 2025 | BHADRADRI KOTHAGUDEM

రెస్క్యూ ముగిసింది.. విషాదం మిగిలింది

# విగతజీవిగా ఉపేందర్

- మృతదేహాన్ని బయటకు తీసిన సహాయక బృందాలు
- 'భద్రాచలం' ఘటనలో రెండో మేస్త్రీ మృత్యువాత
- 36 గంటల రెస్క్యూ ఆపరేషన్ తరువాత స్పష్టత
- 'ఆరంతస్తుల' శిథిలాల కింద ఇద్దరే ఉన్నట్లు నిర్ధారణ
- ఊపిరి పీల్చుకున్న అధికారులు, పట్టణ ప్రజలు
- నిర్విరామంగా శ్రమించిన యంత్రాంగం, రెస్క్యూ టీం
- భద్రాద్రి ఆసుపత్రి ఎదుట బీఆర్ఎస్, వామపక్షాల ధర్నా
- బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్

మట్టిదిబ్బలా మిగిలిన ఆరంతస్తుల భవన శిథిలాలు, ఇన్‌సెట్‌లో మృతుడు ఉపేందర్ (ఫైల్)

భద్రాచలం, మార్చి 28: ఆరంతస్తుల భవనం కూలిన ప్రమాదంలో రెండో మేస్త్రీ ఉపేందర్ కూడా విగతజీవుడయ్యాడు. శుక్రవారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో సహాయక బృందాలు అతడి మృతదేహాన్ని శిథిలాల నుంచి బయటకు తీశాయి. భద్రాచలం పట్టణంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలో ఈ నెల 26న నిర్మాణంలో ఆరు అంతస్తుల భవనం కుప్పకూలిన విషయం విదితమే. ఆ భవన శిథిలాల్లో పలువురు ఉన్నట్లు తొలుత ప్రచారం జరిగినప్పటికీ శుక్రవారం రెస్క్యూ ఆపరేషన్ పూర్తయిన తరువాత ఇద్దరే ఉన్నట్లు స్పష్టత వచ్చింది. ఇందులో కొన ఊపిరితో ఉన్న ఒక మేస్త్రీ కామేశ్వరరావును సహాయ బృందాలు గురువారం తెల్లవారుజామున బయటకు తీశాయి. భద్రాచలం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలోనే అతడు ప్రాణాలు విడిచాడు. శిథిలాల కింద చిక్కుకున్న వారి జాడ కోసం రెస్క్యూ బృందాలు 36 గంటలపాటు తీవ్రంగా శ్రమించాయి. శుక్రవారం తెల్లవారుజామున రెండో మేస్త్రీ ఉపేందర్ కూడా విగతజీవిగా లభ్యం కావడంతో అతడి మృతదేహాన్ని కూడా బయటకు తీసుకొచ్చారు. శిథిలాల కింద వీరిద్దరే ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. మరెవ్వరూ లేకపోవడంతో అటు అధికారులు, ఇటు పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

### నిర్విరామంగా శ్రమించినా..

ఈ నెల 26న బుధవారం మధ్యాహ్నం ప్రమాదం జరిగినప్పటి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకూ అధికారులు, సహాయక బృందాల సభ్యులు నిర్విరామంగా శ్రమించారు. కుప్పకూలిన ఆరు అంతస్తుల శిథిలాలను యంత్రాలతో తొలగిస్తూ, ఆ శిథిలాల కింద చిక్కుకున్న వారి జాడ కోసం అన్వేషిస్తూ ముందుకు సాగారు. స్థానిక పంచాయతీ సిబ్బంది సహకారంతో సింగరేణి, ఐటీసీ సంస్థల రెస్క్యూ టీం సభ్యులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాల సభ్యులు విరామం లేకుండా చెమటోడ్చారు. కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో, ఏఎస్పీ, ఆర్డీవో వంటి ఉన్నతాధికారులు కూడా తక్షణమే స్పందించి సహాయక చర్యలను ముమ్మరం చేసి పర్యవేక్షించారు. కానీ, శిథిలాల్లో చిక్కుకున్న ఇద్దరూ ప్రాణాలు కోల్పోవడం.. చివరికి విషాదాన్ని మిగిల్చింది.

## ఆసుపత్రి ఎదుట బీఆర్ఎస్, వామపక్ష నేతల ధర్నా..

ఆరంతస్తుల భవనం కూలిన ప్రమాదంలో మేస్త్రీలు కామేశ్వరరావు, ఉపేందర్ మృతిచెందడంతో వారి కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్, వామపక్షాల నాయకులు శుక్రవారం ధర్నా చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేసేంత వరకూ మృతదేహాల పోస్టుమార్టానికి అంగీకరించబోమంటూ తేల్చిచెప్పాయి. మృతుల కుటుంబ సభ్యులు, నాయకులు ఆసుపత్రి మార్చురీ వద్ద భీష్మించారు. దీంతో వైద్యులు మార్చురీ గదికి వెళ్లలేకపోయారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ.. ఒక్కో కుటుంబానికి రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని, రెండు కుటుంబాల్లో ఒక్కొక్కరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులు అక్కడికి చేరుకొని.. మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తామని, ఆర్థిక భరోసా కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి అప్పగించారు. బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, ఆకోజు సునీల్‌కుమార్, రేపాక పూర్ణచందర్ రావు, వామపక్ష నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేశ్, ఎంబీ నర్సారెడ్డి, గడ్డం స్వామి, కుల సంఘాల నాయకులు, మృతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం బాధిత కుటుంబాలను బీఆర్ఎస్, వామపక్ష నాయకులు పరామర్శించారు. న్యాయం జరిగేంత వరకూ మీతో కలిసి పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు.. ఆర్డీవో దామోదర్‌రావుతో సమావేశమయ్యారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని, ప్రమాదకారకులను శిక్షించాలని కోరారు.

భద్రాచలం ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న రేగా, బీఆర్ఎస్ నేతలు, వామపక్ష నాయకులు

సుజాతనగర్ మండలం సింగభూపాలెంలో గ్రామంలో భగీరథ నీరు రాని రామాలయం బజార్

# పల్లెల్లో దాహం కేకలు

- వేసవి ప్రారంభంలోనే కన్నీటి కష్టాలు
- 'మిషన్ భగీరథ' నీరు రావడం లేదు
- అలంకారప్రాయంగా చేతిపంపులు
- నల్లాల వద్ద గంటలకొద్దీ ఎదురుచూపులు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ తాగునీటి వెతలు
- మండిపడుతున్న పల్లెజనం

పల్లెల్లో దాహం కేకలు మొదలయ్యాయి. వేసవికాలం ప్రారంభంలోనే నీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏ గ్రామానికెళ్లినా కన్నీటి కష్టాలే దర్శనమిస్తున్నాయి. చాలావరకు గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు తాగునీరు అందడం లేదు. కొన్నిచోట్ల అరకొరగా అందుతున్నప్పటికీ వేసవికాలం కావడంతో అవీ ఎటూ సరిపోవడం లేదు. అక్కడక్కడ ఉన్న చేతిపంపులు అలంకారప్రాయంగానే కనిపిస్తున్నాయి. మహిళలు పనులు మానుకొని నల్లాల వద్ద గంటలకొద్దీ నీటి కోసం వేచిచూడాల్సిన దుస్థితి ఉంది. నీటి కోసం ఇంతగా అల్లాడిపోతున్నా ఆర్‌డబ్ల్యూస్, ఇంజినీరింగ్, పంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని జనం మండిపడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి కష్టాలను ఎదుర్కోవడం ఎలా అని తెగ భయపడుతున్నారు. తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని అన్ని గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో అధికారులను వేడుకుంటున్నారు. అయితే గత కేసీఆర్ పదేండ్ల పాలనలో తాగునీటి తంటాలు ఎరుగమని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ మొదలయ్యాయని పల్లె జనం అభిప్రాయపడడం గమనార్హం. - భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ కరకగూడెం, మార్చి 28

''అది సుజాతనగర్ మండలం సింగభూపాలెం గ్రామం. 1,500 కుటుంబాలు ఉంటాయి. అక్కడ ఉన్న మూడు బజార్లలో ఒక బజారుకు అసలు నీరు రాదు. 200 ఇండ్లకు తాగునీరు రావడం లేదంటే నమ్మాలి. ఇండ్లకు పైపులైన్లు వేసి ఉన్నా నల్లా కలెక్షన్లు మాత్రం మొత్తం వంగిపోయి, పడిపోయి ఉన్నాయి. మిషన్ భగీరథ పైపులైన్ వేసినప్పటి నుంచీ చుక్కనీరు రాలేదని ఆ గ్రామస్తులు చెబుతున్నారు. చేతిపంపులు ఉన్నా పనిచేయడం లేదు. మిగతా రెండు బజార్లకు కూడా స్థానిక వాటర్ ట్యాంకు ద్వారా మాత్రమే నీరు వస్తున్నాయని చెబుతున్నారు.''

అసలే మండే ఎండలు. నీటివాడకం ఎక్కువగా ఉండేది ఇప్పుడే. ఇలాంటి సమయంలో గ్రామాల్లో నీటి సరఫరా లేకపోతే ప్రజలు నానా తంటాలు పడాల్సి ఉంటుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చాలావరకు గ్రామాల్లో తాగునీటి సమస్య తాండవిస్తున్నది. చుంచుపల్లి మండలం 4వ ఇంక్లైన్‌లో తాగునీటి సమస్య ఉండడం వల్ల గంటలకొద్దీ నల్లాల వద్దనే పడిగాపులు కాయాల్సి వస్తుంది. సుజాతనగర్ మండల కేంద్రం బాలాజీనగర్‌లో పైపులైన్ వేసి నల్లాలు బిగించినా కలెక్షన్ ఇవ్వకపోవడం వల్ల నీరు రావడం లేదు. దుమ్ముగూడెం మండలం ఎర్రబోరు గ్రామంలో ట్యాంకు ఉన్నా అక్కడకు నీరు ఎక్కకపోవడంతో సమస్య వెంటాడుతున్నది. పాల్వంచ మండలం రాజీవ్‌నగర్‌లో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇల్లెందు మండలం సీఎస్పీ పంచాయతీ రాజీవ్‌నగర్‌లో తాగునీటి సమస్య ఉందని చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడంతో సీపీఎం నాయకులు నిరసన తెలిపిన దాఖలాలు ఉన్నాయి.

సింగభూపాలెంలో మూలనపడిన చేతిపంపు

### చుక్కనీరు రావడం లేదు..

భగీరథ కాదు కదా ఏ నీరూ రావడం లేదు. చేతిపంపు మాకు దూరంగా ఉంది. నల్లా ఉన్నా దాని నుంచి నీరొచ్చిన పాపాన లేదు. ఇంట్లో మోటారు ఉండడం వల్ల ఆ నీరు వాడుకుంటున్నాం. తాగేనీరు భగీరథ ద్వారా వస్తుందని చూస్తున్నాం.. అయినా ఇప్పటివరకు పైపులైన్‌లో చుక్కనీరు రాలేదు. మా బజారులో ఎవరికీ నీరు రావడం లేదు.

– నల్లగొర్ల రాంబాయమ్మ, సింగభూపాలెం, సుజాతనగర్ మండలం

### నీటికోసం ఎదురుచూస్తున్నాం..

మా ఊర్లో రెండు బజార్లకు నీళ్లు వస్తాయి. కానీ.. మాకు మాత్రం రావు. ఎన్నిసార్లు చెప్పినా అధికారులెవరూ పట్టించుకోవడంలేదు. ఏం చేయాలో అర్థంకావడం లేదు. పంచాయతీ ఆఫీసు పక్కనే మా బజారు ఉంటది. నీటి కోసం ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నాం.

– నల్లగొర్ల వెంకటమ్మ, గ్రామస్తురాలు, సింగభూపాలెం

### గుడి దగ్గరకెళ్లి తెచ్చుకుంటున్నా..

మా నల్లాలో నీరు రావడం లేదు. పక్కనే ఉన్న గుడి మోటరు దగ్గర నీరు పట్టుకుంటున్న. ముసలోన్ని నేను ఎక్కడికి పోవాలి. పంపుల వద్దకు పోయి నడిచే ఓపిక లేదు. గుడివాళ్లను అడిగితే నీరు పట్టుకోమన్నరు. మా ఊళ్లో ట్యాంకు ఎందుకు కట్టారో తెలియదు. నీరు ఎందుకు రావడం లేదో కూడా ఎవరూ చెప్పడం లేదు.

– రాసబంటి మల్లయ్య, వృద్ధుడు, సింగభూపాలెం

### 'కరకగూడెం'లో తీవ్ర సమస్య..

కరకగూడెం మండలం కొత్తగూడెంలో బావిలో నీటిని నిల్వ చేసుకున్న గ్రామస్తులు

కరకగూడెం మండలంలో తాగునీరు సమస్య తీవ్రంగా వేధిస్తున్నది. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో బావులు, బోరింగ్ నీటిని తాగుతూ ప్రజలు రోగాలపాలవుతున్నారు. మండలంలోని కొత్తగూడెం, చొప్పాల పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో వందల మంది ప్రజలు ఉన్నారు. గత కొద్దిరోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో బావులు, బోర్ల నీటిని వాడుతున్నారు. కొంతమందికి నల్లాలు బిగించి కనీసం కనెక్షన్ కూడా ఇవ్వకపోవడంతో సురక్షిత నీరు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదునుగా భావించిన మినరల్ ప్లాంట్ల నిర్వాహకులు 20 లీటర్ల నీటిని రూ.20 చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నప్పటికీ అధికారులు, పాలకులు కన్నెత్తి కూడా చూడడం లేదని గ్రామస్తులు అంటున్నారు.

### బావి నీరు తాగుతున్నాం..

గత ప్రభుత్వంలో మిషన్ భగీరథ నీరు సమయానికి వచ్చేవి. కానీ.. ప్రభుత్వం మారిన తరువాత గుక్కెడు తాగునీటికి నానా అవస్థలు పడుతున్నాం. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో బావి నీరు దూర ప్రాంతాల నుంచి తెచ్చుకుని తాగుతున్నాం. బిందెలతో నీరు మోయాలంటే యాష్టకొస్తున్నది. బావి నీరు తాగడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయి.

– మంకిడి సుమలత, కొత్తగూడెం గ్రామం, కరకగూడెం మండలం

### రోగాలబారిన పడుతున్నాం..

ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇచ్చారు.. కానీ.. మిషన్ భగీరథ నీరు మాత్రం రావడం లేదు. బావి, చేతిపంపు నీరు తెచ్చుకొని తాగుతున్నాం.. అపరిశుభ్ర నీరు తాగడం వల్ల రోగాలబారిన పడుతున్నాం. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావడం లేదు. దయచేసి అధికారులు స్పందించి తీవ్రమైన తాగునీటి ఎద్దడిని నివారించాలని కోరుతున్నాం.

– నరసింహారావు, కొత్తగూడెం గ్రామం, కరకగూడెం మండలం

### మా గోసను అర్థం చేసుకోండి..

మా గోసను అర్థం చేసుకుని మా ఊర్లో తాగునీటి సమస్యను పరిష్కరించండి. నల్లాలు పెట్టారు.. కనెక్షన్లు ఇవ్వలేదు. మిషన్ భగీరథ నీరు రాక నానా అవస్థలు పడుతున్నాం. అధికారులు పట్టించుకోవడం లేదు. ఇంకా ఎండలు ఎక్కువైతే మా పరిస్థితి భయానకమే.

– నాలి రాధ, పాయంవారిగుంపు, కరకగూడెం మండలం

చండ్రుగొండ మండలం గానుగపాడు, రేపల్లెవాడ గ్రామాల్లో ఎండిన యాసంగి పైర్లు

చండ్రుగొండ మండలంలో ఎండిన ఎదుళ్లవాగులోని నీటి చెలమ గుంత

# ఎండిన వాగు.. వాడిన పంట!

- కళ్లముందు ఎండిపోతున్న పంటను చూసి తల్లడిల్లుతున్న అన్నదాతలు
- ఎగుళ్ల వాగులో యంత్రాల సాయంతో గుంతలు తీసినా అందని నీరు
- పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని చండ్రుగొండ మండల రైతుల ఆందోళన

చండ్రుగొండ మండలంలో ఎండిపోయిన ఎదుళ్లవాగు

చండ్రుగొండ, మార్చి 28: వాగు నీటిని నమ్ముకుని ఏటా మాదిరిగానే రైతులు యాసంగి పంట సాగు చేశారు. పంట వేసే సమయంలో నీరున్నా.. పూర్తి వేసవి రాకమునుపే నెల రోజుల ముందే ఎదుళ్లవాగు ఎండిపోయింది. వాగును నమ్ముకొని పంట సాగు చేసిన చండ్రుగొండ మండల రైతులు కళ్లముందు ఎండిపోతున్న పంటను చూసి తల్లడిల్లుతున్నారు. భగీరథ ప్రయత్నం చేసినా పంటను కాపాడుకోలేని పరిస్థితి నెలకొన్నది. చండ్రుగొండ మండలంలోని ప్రధాన సాగునీటి వనరు ఎదుళ్లవాగు ఆధారంగా తుంగారం, రేపల్లెవాడ, సత్యనారాయణపురం, గానుగపాడు, తిప్పనపల్లి, సీతాయిగూడెం, ఇమ్మడిరామయ్యబంజర, అయ్యన్నపాలెం, చండ్రుగొండ గ్రామాల్లోని సుమారు ఐదారువందల మంది రైతులు యాసంగి పంటలు పండిస్తున్నారు. 700 ఎకరాల మేర వరి పంట పండిస్తున్నారు. పదేళ్లపాటు సాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటలు పండించుకున్నారు. అయితే ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా వరి పొట్ట దశలో ఉండగానే వాగు ఎండిపోయింది. దీంతో చేతికొచ్చే దశలో ఉన్న పంటను కాపాడుకునేందుకు వాగులో జేసీబీలు, క్రేన్ల సాయంతో గుంతలు తవ్వించినా అవి కూడా పది రోజుల వ్యవధిలోనే ఎండిపోయాయి. ఇప్పటికే సుమారు 70 ఎకరాల్లో పంట ఎండిపోయింది. నీరు అందకపోతే మరికొద్ది రోజుల్లో ఇంకొన్ని ఎకరాలు ఎండిపోయే పరిస్థితి ఉన్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వరి సాగు రైతులు వాపోతున్నారు.

# కేంద్రమంత్రితో ఎంపీ వద్దిరాజు భేటీ

ఖమ్మం, మార్చి 28: కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి డి.కుమారస్వామితో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం భేటీ అయ్యారు. పార్లమెంట్‌లోని కేంద్రమంత్రి చాంబర్‌లో ఆయన్ని కలిసి ఆదిలాబాద్ వద్ద ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ప్లాంటును పునరుద్ధరించాల్సిందిగా కోరుతూ వినతిపత్రం అందజేశారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేయడంలో భాగంగా నెలకొల్పిన ఈ పరిశ్రమ కొన్నేళ్లుగా మూతపడడంతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు రోడ్డునపడ్డారని ఎంపీ రవిచంద్ర మంత్రికి వివరించారు. ఈ విషయమై మాజీ మంత్రి జోగు రామన్న నాయకత్వాన కార్మిక నాయకులతో కూడిన ఒక ప్రతినిధి బృందం వచ్చేనెల 2వ తేదీన ఢిల్లీ వస్తున్నదని, వారు కలిసేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాల్సిందిగా ఎంపీ వద్దిరాజు కోరగా, మంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించారు.

కేంద్రమంత్రి కుమారస్వామికి వినతిపత్రం ఇస్తున్న వద్దిరాజు

## ప్రణాళికాబద్ధంగా ప్యాక్స్ పనిచేయాలి

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, మార్చి 28: ప్రణాళికాబద్ధంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్) పని చేయాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలు ఆశించిన రీతిలో పని చేయడం లేదన్నారు. రైతులకు సరైన సమయంలో తక్కువ వడ్డీతో పెట్టుబడి అందించడం, రైతుల నుంచి డిపాజిట్ సేకరణ జరగాలన్నారు. ప్యాక్స్‌లో ఉన్న సభ్యులు యాక్టివ్‌గా ఉండేలా చూడాలన్నారు. ప్యాక్స్ రైతులకు ఉపయోగపడే నూతన కార్యక్రమాలను చేపట్టేలా ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. జిల్లాలో సరిగా పనిచేసే, చేయని ప్యాక్స్ వివరాలు సేకరించాలని ఆదేశించారు. రైతులకు నూతన సాగు విధానాలు, ఫిష్ ఫార్మింగ్, ఫిష్ ఫాండ్స్ ప్రత్యామ్నాయ పంటల సాగు వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు సమావేశాల నిర్వహణ షెడ్యూల్ తయారు చేయాలని ఆదేశించారు. రైతులకు ఆదాయ మార్గాలు ఎలా కల్గించాలనే అంశంపై ప్యాక్స్ పని చేయాలని తెలిపారు. ఏప్రిల్ నుంచి ప్రణాళికాబద్ధంగా ప్యాక్స్ పని చేయాలని సూచించారు. రెగ్యులర్‌గా సమావేశాలు నిర్వహించాలని, పైలట్ ప్రాజెక్టు కింద 3 ప్యాక్స్ ద్వారా వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్‌కు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. జడ్పీ సీఈవో దీక్షా రైనా, నాబార్డు జీఎం సుజిత్‌కుమార్, జిల్లా కో ఆర్డినేటివ్ అధికారి గంగాధర్, వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య, మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీరమణి, డీసీసీబీ సీఈవో ఆదిత్య పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలు అమలు చేయాలి

బోనకల్లు జీపీ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

బోనకల్లు జీపీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

బోనకల్లు, మార్చి 28: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బోనకల్లు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చింతలచెరువు కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసే విధంగా ప్రభుత్వం తీరు ఉన్నదని ఆరోపించారు. ఆత్మీయ భరోసా, మహిళలకు రూ.2,500 చొప్పున వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, ఎకరాకు రూ.12 వేలు రైతు భరోసా ఇస్తామని చెప్పి ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదన్నారు. ఇందుకోసం సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కలారు సురేష్, బంధం శ్రీనివాసరావు, తెల్లాకుల శ్రీనివాసరావు, బిల్లా విశ్వనాథం, తెల్లాకుల రజిని, గుగులోతు నరేశ్, శ్రీనివాసరావు, షేక్ సిలార్, బోయినపల్లి వీరబాబు పాల్గొన్నారు.